మనం
కడప | అన్నమయ్య

**ఎగువ అబ్బవరం హరిజనవాడలో భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం**



వివరాలు 5లో





# రాజంపేటలో యల్లటూరు శ్రీనివాసరాజు రాజకీయ ముద్ర



**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా యల్లటూరు చొరవ.. వైసీపీకి గట్టి దెబ్బ**
**నారపురెడ్డిపల్లె నుంచి యల్లటూరు సమక్షంలో 150 కుటుంబాలు చేరిక**
**మీకు ఏ కష్టమొచ్చినా నేనున్నా.. ప్రతి కార్యకర్తనూ గుండెల్లో పెట్టుకుంటా**
**యల్లటూరు శ్రీనివాసరాజు కొండంత భరోసా**





మనం ప్రతినిధి రాజంపేట: సెప్టెంబర్ 24
రాజంపేట పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు తనదైన ప్రజాకర్షక నాయకత్వంతో రాజకీయాల్లో సరికొత్త జోష్ నింపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ, నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటున్న యల్లటూరు శ్రీనివాస రాజు వైఖరికి నియోజకవర్గ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదర్శవంతమైన పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో యల్లటూరు చూపిస్తున్న చొరవతో ప్రత్యర్థి పార్టీల నుంచి భారీగా చేరికలు వెల్లువెత్తుతున్నాయి.

**యల్లటూరు సమక్షంలో వైసీపీకి భారీ షాక్**

రాజంపేట పట్టణ పరిధిలోని నారపురెడ్డిపల్లెకు చెందిన స్థానిక వైసీపీ కీలక నాయకుడు రఘు యాదవ్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు ముకుమ్మడిగా ఆ పార్టీని వీడి, యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసంతో జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. అంతకుముందు బలిజపల్లి గంగమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పట్టణంలో చేపట్టిన భారీ ర్యాలీ శ్రీనివాసరాజుకు ప్రజల్లో ఉన్న పట్టును, ప్రజాబలాన్ని స్పష్టం చేసింది. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీనివాసరాజు నాయకత్వానికి సంపూర్ణ మద్దతు పలికారు.

**కార్యకర్తలకు యల్లటూరు కొండంత ధైర్యం**

యల్లటూరు భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ యల్లటూరు శ్రీనివాసరాజు స్వయంగా జనసేన కండువాలు కప్పి ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తల్లో పూర్తి ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ గంభీరంగా మాట్లాడారు:
"కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలే నిజమైన హీరోలు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సిద్ధాంతాలను, నా నాయకత్వాన్ని నమ్మి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్క కార్యకర్తను నా స్వంత కుటుంబ సభ్యుడిలా కాపాడుకుంటాను. మీకు ఏ కష్టం వచ్చినా, ఏ అర్ధరాత్రి పిలిచినా ముందుండేది ఈ యల్లటూరు శ్రీనివాసరాజు మాత్రమే. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడి గడపకూ చేరేవరకు మన పోరాటం ఆగదు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని ఎక్కడా తగ్గనివ్వం. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుకుందాం.

**రాజంపేటలో తిరుగులేని శక్తిగా యల్లటూరు నాయకత్వం**

శ్రీనివాసరాజు మాటలతో నూతనంగా చేరిన కుటుంబాల్లోనూ, పార్టీ శ్రేణుల్లోనూ నూతనోత్సాహం వెల్లివిరిసింది. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి సమర్థంగా తీసుకువెళ్తూ, బలహీన వర్గాల సమస్యలకు అండగా నిలుస్తున్న శ్రీనివాసరాజు రాజంపేట రాజకీయాల్లో తిరుగులేని కేంద్రబిందువుగా ఎదుగుతున్నారు. ఈ చేరికల కార్యక్రమంలో జనసేన, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన విభాగాలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కార్తికేయ నగర్‌లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ..

**శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఘనంగా అంకురార్పణ**
**వేద మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ భూమిపూజ**
**రూ.38 లక్షల నిధులతో నూతన ఆలయం, ప్రహరీ గోడ నిర్మాణం**
**శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**





సుండుపల్లి మనం న్యూస్ సెప్టెంబర్ 24: కేంద్రంలోని కార్తికేయ నగర్‌లో ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరిశాయి. నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మరియు రక్షణ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ పుణ్యకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారికి కార్తికేయ నగర్ ప్రముఖులు, మండల నాయకులు పూర్ణకుంభంతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా శిలాన్యాసం చేసి పనులను ప్రారంభించారు. కార్తికేయ నగర్‌లో ఆలయ నిర్మాణ ఆవశ్యకతపై స్థానికులు గతంలో చేసిన విన్నపానికి సానుకూలంగా స్పందించిన చమర్తి, అధికారులతో సమన్వయం చేసి మొత్తం రూ.38లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో స్థానికుల చిరకాల కోరిక నేడు నెరవేరింది. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. సమాజంలో శాంతి, సద్భావన పెంపొందడానికి ఆధ్యాత్మిక చింతన ఎంతో దోహదపడుతుందని, కాలనీలలో దైవిక వాతావరణం నెలకొనేలా దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణ పనులను ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయిస్తామని భక్తులకు భరోసా ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన చమర్తిని కార్తికేయ నగర్ వాసులు హర్షధ్వానాల నడుమ శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి మండల ప్రముఖులు, కార్తికేయ నగర్ పెద్దలు, మహిళలు మరియు అధిక సంఖ్యలో శివ-సుబ్రహ్మణ్య భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.




# రూ.40లక్షలతో రాములవారి గుడి

**నెరవేరిన గ్రామస్థుల కల!**
**శంకుస్థాపన చేసిన 'కుడా' ఛైర్మన్ సతీమణి ముక్కా వరలక్ష్మి**



పుల్లంపేట మనం న్యూస్
రైల్వే కోడూరు నియో జకవర్గంలో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అం దిస్తూ ముందుకు సాగుతున్నామని రైల్వే కోడూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీ మణి ముక్కా వరలక్ష్మి తెలిపారు. పుల్లంపేట మండలం టీ.కమ్మపల్లి పంచాయతీ పరిధిలోని ఎగవరెడ్డి అరుంధతివాడలో దేవాదాయ శాఖ ద్వారా రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న శ్రీ రాములస్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లా డుతూ.. ఎగవరెడ్డి అరుం ధతివాడ ప్రజల చిరకాల ఆధ్యాత్మిక ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నులిపురుగుల నివారణకు ఆల్బండోజోలు టాబ్లెట్లు అవసరం

చిట్వేలీ సెప్టెంబర్ 24 మనం న్యూస్: మండల వైద్య అధికారి డాక్టర్ శివప్రసాద్ గౌడ్ ఆదేశాల మేరకు చిట్వేలీ లోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల నందు అన్నిటికి ఆల్బండాజోలు, టాబ్లెట్ లను డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దివార్మింగ్ డే ఉన్నందున 13వ సచివాలయం పరధిలోని ఏ.ఎన్.ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు ప్రతి ఒక్క స్కూల్ ని విజిట్ చేసి స్కూల్ హెచ్.ఎం. లకు అందచేయడం జరిగింది. అనంతరం చిట్వేలీ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇంచార్జ్ హెచ్ఎం సోఫియా వారికీ ఆల్బండాజోలు టాబ్లెట్ అందచేయడం జరిగిందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపెర్వైజర్ ఇస్మాయిల్ భాష, ఎం.ఎల్.హెచ్.పి కల్పనా, ఏ.ఎన్.ఎం. మరియా, రాణి, కృష్ణవేణి, ఆశలు లక్ష్మీదేవి, కన్యాకుమారి, పాల్గొన్నారు.

## లెప్రసి వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం



ఒంటిమిట్ట సెప్టెంబర్ 24(మనంన్యూస్): ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో 11-09-26 నుండి జరుగుతున్న లెప్రసి సర్వే లో గుర్తించిన లెప్రసి అనుమానితులను జిల్లా లెప్రసి కార్యాలయంనుండి వచ్చిన ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ విక్టర్ మనోహర్ పరీక్షించడం జరిగింది.తరువాత ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై సర్వే గురించి తగిన సూచనలు,సలహాలు ఇవ్వడం జరిగింది.తదుపరి ఒంటిమిట్ట పోస్టాఫీసు దగ్గర జరుగుతున్న లెప్రసి సర్వేని తనిఖీ చేసి తగు సూచనలను ఇవ్వడం జరిగింది.చివరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భావన సమావేశమై సర్వే గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటి పారా మెడికల్ ఆఫీసర్ సురేష్ ,ఆరోగ్య విస్తరణాధికారి రాధా కృష్ణారెడ్డి,పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ,సూపర్ వైజర్లు భాస్కర్ రెడ్డి,సుజాత ఆరోగ్య కార్యకర్తలు,ఆశాలు పాల్గొనడం జరిగింది

## ఒంటిమిట్టలో ఘనంగా గణేశుని గ్రామోత్సవం



ఒంటిమిట్ట సెప్టెంబరు 24 (మనం న్యూస్) వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఒంటిమిట్ట దారా వీధిలో ఏర్పాటు చేసిన గణనాథునికి 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలందుకున్న నాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం సాయం త్రం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రత్యేకంగా గణపతి స్వామి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత, మహిళలు, చిన్నారులు రంగులు చల్లు కుంటూ, బాణసంచా కాలుస్తూ, వినాయక భజనలతో సందడి చేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీసభ్యులు, యువత, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డీజే పాటల నడుమ స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

## పిల్లలలో నులిపురుగుల నివారణే లక్ష్యం

ముద్దనూరు , సెప్టెంబర్ 24, మనం న్యూస్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. నులిపురుగుల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు మండల అభివృద్ధి అధికారిని రాధాకృష్ణ వేణి,అధికారుల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పిల్లల్లో నులిపురుగుల సమస్యను నివారించి, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 25న మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు అక్టోబర్ 5న ప్రత్యేకంగా మాత్రలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యువ పి ఆర్ డి వీరభద్రుడు సిహెచ్ఓ ప్రసాద్ యాదవ్, ఇబ్బంది పాల్గొన్నారు.




# నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ సూచనలు



సిద్ధవటం, సెప్టెంబర్ 24 (మనం న్యూస్ )
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సిద్ధవటం పెన్నా నదిలో నీటి ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిపారు.పెన్నా నది పరివాహక ప్రాంతాలైన జ్యోతి, వంతాటిపల్లె, గాండ్లపాలెం, ఆకుల వీధి తదితర ప్రాంతాల ప్రజలు నది వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నదిలో చేపల వేటకు వెళ్లే జాలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నదిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. పల్లె ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, బర్రెలను మేపే కాపరులు కూడా పెన్నానది సమీపంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.హై లెవల్ వంతెన సమీప ప్రాంతాలకు ప్రజలు వెళ్లవద్దని సీఐ సూచించారు. నదిఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వంతెనపై నిలబడి సెల్ఫీలు తీసుకోవడం, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లడం చేయవద్దన్నారు. ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పెన్నానది వద్ద కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు పల్లె ప్రాంతాల్లో చాటింపు వేయిస్తున్నట్లు చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిద్ధవటం ఎస్సై హారికతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ దార్ల రాజశేఖర్ డిమాండ్




రైల్వే కోడూరు, సెప్టెంబర్ 24, మనం న్యూస్
ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర నాయకులు దార్ల రాజశేఖర్ డిప్యూటీ తహసిల్దార్ సుధీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దార్ల రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఇతర పోస్టులను కూడా గుర్తించి, నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు వయోపరిమితి సమస్యలు ఎదురవుతున్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన న్యాయం చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేసి, పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బూర వాసు డిమాండ్ చేశారు. 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేసే వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పక్షాన ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పాలకొండ సుధీర్, పాలతోటి ప్రకాష్, జంగిటి పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని అన్ని పంచాయితీలు కూటమి గెలుస్తుంది

### యస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు బాణాల హరి



సిద్ధవటం సెప్టెంబర్ 24(మనం న్యూస్ )
సిద్ధవటం మండలంలోనీ అన్ని పంచాయతీలు కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోబోతుందని తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ మాజీ మండల అధ్యక్షులు బాణాల హరి జోష్యం చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాజంపేట ఇంచార్జి చమ్మర్తి జగన్మోహన్ రాజు నాయకత్వంలో రాజంపేట నియోజకవర్గం ఎంతో పటిష్టంగా తెలుగుదేశం పార్టీ బలపడిందని అందులో ఎలాంటి సందేహం లేదని రాజంపేట నియోజకవర్గం లో చమ్మర్తి లాంటి నాయకుడు మాకు మళ్లీ రాడు అని అటువంటి నాయకుడే మాకు మళ్ళీ మళ్ళీ కావాలని రాజంపేట ప్రజలు కోరుకుంటున్నారు అని ఆయన అన్నారు. కానీ కొంతమంది గొడ్డలి పార్టీ నాయకులు మేము గెలుస్తామని అపోహాలు పడుతున్నారని, ఆ పార్టీ పని ఇక అయిపోయింది అని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో ప్రజలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు సానుకూలంగా ఉన్నారని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలకు న్యాయం జరగాలంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యపడుతుందని వారు అన్నారు. వచ్చే స్థానిక ఎలక్షన్లలో సిద్ధవటంలో పంచాయతీలు మా కూటమి పార్టీ నాయకులే గెలుస్తారని తెలిపారు .

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

### ఘనంగా నిమజ్జన వేడుకలు



ఒంటిమిట్ట సెప్టెంబర్ 24(మనం న్యూస్) ఒంటిమిట్ట బస్టాండ్ లో రజకులు ఏర్పాటుచేసిన వినాయకుని నిమజ్జన కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 11 రోజుల పాటు వినాయక స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం సాయం త్రం గణేశుని ప్రతిమ నిమజ్జనానికి బయలుదేరింది. డీజే పాటలు నడుమ స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చెక్క బజన నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని డీజే పాటల నడుమ మహిళలు, చిన్నారులు కోలాటాలు ఉత్సాహభరితంగా సాగాయి.

గణేశుని గ్రామోత్సవం ఒంటిమిట్ట పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో సాగింది. అనంతరం గణేశ్ ప్రతిమ నిమజ్జనంకు బయలుదేరింది.



## తాటి విత్తనాలు నాటిన కడప ఫారెస్ట్ సిబ్బంది

సిద్ధవటం, సెప్టెంబర్ 24 మనం న్యూస్: కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనుమలోపల్లి, బిట్ భాకరాపేట సమీపాన కడప ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది తాటి విత్తనాలు కూలీలచే నాటించారు సిద్ధవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కడప ఫారెస్ట్ రేంజ్ పరిధి, కనుమలోపల్లి, కేజీ పెంట అటవీ బీట్లల్లో, కడప డిఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాలతో కడపఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ సూచన మేరకు కడప ఫారెస్ట్ రేంజ్ పరిధి కేజీ పెంట, కనుమలోపల్లి అటవీ బీట్, భాకరాపేట సమీపాన తాటి విత్తనాలు నాటారుఈ సందర్భంగా గురువారం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫారెస్ట్ సరిహద్దుల వెంబడి కేజీ పెంట, కనుమల్లోపల్లి ఫారెస్ట్ బిట్ల సమీపంలో కూలీలచే 2 వేలు పైబడి విత్తనాలు నాటామని వన్యప్రాణుల ఆహారానికి తాటికాయలు ఉపయోగపడతాయని పచ్చని చెట్లు పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేసి అటవీ ప్రాంతాన్ని పచ్చదనంతో ఉండే చెట్లు సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్ బి ఓ, రాజశేఖర్, పార్వతి, కూలీలు పాల్గొన్నారు

## 9వ రోజు నల్ల బ్యాడ్జీలతో వీఆర్ఏల నిరసన

ముద్దనూరు, సెప్టెంబర్, 24, మనం న్యూస్:
స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు తమ సామరస్యమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు . తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వీఆర్ఏలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల జేఏసీ నాయకులు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన రాజంపేట సాధనే నా ధ్యేయం: డాక్టర్ నవీన్ కుమార్

## గాంధీ విగ్రహం సమీపంలో పేరుకుపోయిన చెత్తను తొలగించిన వైనం





రాజంపేట సెప్టెంబర్ 24(మనం న్యూస్) : రాజంపేట పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ కుమార్ స్పష్టం చేశారు. రాజంపేట పట్టణంలోని గాంధీ విగ్రహం సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని డాక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్వయంగా పర్యవేక్షించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల సోషల్ మీడియాలో రాజంపేట పట్టణంలో చెత్త సమస్యపై వచ్చిన విమర్శలు తనను తీవ్రంగా కలచివేశాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంతలా చెత్త పేరుకుపోయి ఉండటంపై ప్రజలు వ్యక్తపరుస్తున్న ఆవేదన చూసి చాలా బాధ కలిగిందన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచనతోనే ఈ స్వచ్ఛతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. పట్టణ పారిశుద్ధ్యంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలోని చెత్తను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పారవేయకూడదని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య వాహనాలు వచ్చినప్పుడే తడి, పొడి చెత్తను సిబ్బందికి అందించాలని సూచించారు. రోడ్లపై వ్యర్థాలు వేయడం వల్ల పరిసరాలు కలుషితమై విష జ్వరాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రమదానం చేశారు. పట్టణ పరిశుభ్రతకు నడుం బిగించిన డాక్టర్ నవీన్ కుమార్‌ను స్థానికులు అభినందించారు.

# ఎగువ అబ్బవరం హరిజనవాడలో భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం : పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు







రాయచోటి మనం న్యూస్ సెప్టెంబర్ 24 ఎగువ అబ్బవరం హరిజనవాడలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిమజ్జన ఊరేగింపు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే నీటి ప్రదేశాల వద్ద జాగ్రత్తలు పాటిస్తూ, విద్యుత్ తీగలు మరియు ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, పోలీసుల సూచనలు--నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. వినాయకుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలి" అని సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు.

# పనీర్ పేరుతో మోసం ఇక కుదరదు.. దేశవ్యాప్తంగా నిషేధానికి ఎఫ్‌ఎస్ఎస్ఏఐ ప్రతిపాదన



పనీర్ పేరుతో విక్రయిస్తున్న నాన్-డెయిరీ ఉత్పత్తులపై కేంద్రం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలను నిషేధించేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ముసాయిదా ప్రకారం.. పనీర్ స్వభావం, అందులో ఉపయోగించిన పదార్థాల విషయంలో వినియోగదారులు తప్పుదోవ పట్టకుండా ఈ మార్పులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 'అనలాగ్ ఇన్ డెయిరీ కాంటెక్ట్స్' కేటగిరీలో లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందిన ఉత్పత్తులు ఇకపై తమ పేరు, లేబుల్, మార్కెటింగ్‌లో 'పనీర్' అనే పదాన్ని ఉపయోగించకూడదు. ఈ నిబంధనలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ప్రొహిబిషన్ అండ్ రెస్ట్రిక్షన్స్ ఆన్ సేల్స్) రెగ్యులేషన్స్‌లో చేర్చాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్ణయించింది. ముసాయిదాపై అభిప్రాయాలను 60 రోజుల వ్యవధిలో స్వీకరించనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలపై నిషేధం విధించాయి. మహారాష్ట్రలో ఇటీవల ఆర్టిఫిషియల్ అనలాగ్ పనీర్ తయారీ, పంపిణీ, విక్రయాలపై ఏడాది పాటు నిషేధం విధించారు. రాష్ట్రంలో ఇటీవల పరీక్షించిన పనీర్ నమూనాల్లో 35 శాతానికి పైగా నాణ్యత పరీక్షల్లో విఫలమయ్యాయి. కూరగాయల కొవ్వు కల్తీ ఉన్నట్లు పరీక్షల్లో తేలడంతో ఈ చర్య తీసుకున్నారు. గుజరాత్ ప్రభుత్వం కూడా నాన్-స్టాండర్డ్ అనలాగ్ పనీర్, చీజ్, వెన్న తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా నిషేధం ప్రకటించింది. కూరగాయల నూనెతో పాటు ఇతర డెయిరీయేతర పదార్థాల తో తయారు చేసిన ఉత్పత్తులను పనీర్‌గా విక్రయించడం వల్ల వినియోగదారులు మోసపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల అసలైన పాల ఉత్పత్తుల తయారీదారులకు నష్టం కలగడంతో పాటు ఆహార భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి.




# బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు..

లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు

2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ వెల్లడి

కోల్‌కతా సమీపంలో రూ.4,000కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన

ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ

బెంగాల్‌ను తమ కర్మభూమిగా భావిస్తున్నట్టు అదానీ వ్యాఖ్య

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం..

రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు బెయిల్

ఏపీ లిక్కర్ స్కామ్.. కీలక నిందితులకు బెయిల్

రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు ఊరట

ఈడీ స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు

దేశం విడిచి వెళ్లొద్దంటూ కఠిన షరతులు

రేపు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం (లిక్కర్ స్కామ్) కేసులో కీలక నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఊరట లభించింది. ఈ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఈడీ స్పెషల్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఈ మేరకు కోర్టు తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా న్యాయస్థానం పలు కఠినమైన షరతులను విధించింది. నిందితులు దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే దర్యాప్తును ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశించింది. ఇద్దరు నిందితులు లక్ష రూపాయల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీరిద్దరూ దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు పిలిచినప్పుడు తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బెయిల్ ప్రక్రియ పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం వీరిద్దరూ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్టు ఆరోపణలు రాగా, ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ, రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. తాజాగా వీరికి బెయిల్ లభించడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.